క్రమశిక్షణ @ ఎన్‌సీసీ


మొగుళ్లపల్లిలో శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు(ఫైల్)


ఫైరింగ్ నేర్పుతున్న ఎన్‌సీసీ అధికారి రాజయ్య(ఫైల్)

- మొట్లపల్లి, మొగుళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో యూనిట్ ఏర్పాటు
- నాయకత్వ లక్షణాలతో పాటు ఉన్నత విద్యకు తోడ్పాటు
- నేడు ఎన్‌సీసీ డే..

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి, మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఎన్‌సీసీలో చేరారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం శిక్షణ తీసుకుంటున్నారు. క్రమశిక్షణ నేర్చుకుంటూ నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చుకుంటున్నారు. అన్నింటికి మించి దేశభక్తిని పెంపొందించుకుంటున్నారు. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎన్‌సీసీ కోటాలో ప్రవేశం పొందుతున్నారు. కాగా నేడు (ఆదివారం) ఎన్‌సీసీ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

2010 నుంచి ప్రారంభం..

మొట్లపల్లి పాఠశాలలో 2010లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించారు. వరంగల్ గ్రూప్ లోని 10వ బెటాలియన్‌లో ఈ యూనిట్‌ను అప్పటి స్కూల్ అసిస్టెంట్ మహేశ్ కృషితో ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం 50 మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు దేశభక్తి పెంపొందేలా శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మానవత విలువలతో కూడిన జీవనం, శీలనిర్మాణం, శారీరక, మానసిక దృఢత్వం పెంపొందేలా శిక్షణ ఉంటుంది. సమాజసేవలో పాల్గొనేలా వారికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, పింగిళి విజయపాల్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య, ఉపాధ్యాయులు అందించే ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాగా, ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన మొట్లపల్లి పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందారు. పాలిటెక్నిక్‌లో, ఐఐఐటీ బాసరలో ఎన్‌సీసీ కోటాలో సీట్లు సాధించారు.

గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

మొగుళ్లపల్లి, మొట్లపల్లిలో ఎన్‌సీసీ విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, గ్రామంలో మొక్కలు నాటి పచ్చదనం కోసం పాటుపడుతున్నారు. పారిశుద్ధ్య పనుల్లో పాలు పంచుకుంటూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మద్యపానం తాగాడం వలన కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు. ఓటరు నమోదు కోసం ర్యాలీలు చేపట్టారు.

ఘనంగా ఎన్‌సీసీ డే

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు. నవంబర్ 4వ ఆదివారం రోజు ఎన్‌సీసీ డే నిర్వహించుకుంటాని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యశ్రీ ,వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్,రాజు, కుమారస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

శిక్షణ అందిస్తున్నాం..



ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు అన్ని అంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. దీంతో విద్యార్థులలో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతోంది. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేసే విధంగా వారిని సిద్ధం చేస్తున్నాం.

- రాజయ్య, పాఠశాల ఎన్‌సీసీ అధికారి

ఆత్మ విశ్వాసం పెరిగింది



ఎన్‌సీసీలో చేరడం వలన ఆత్మవిశ్వాసం పెరిగింది. శిక్షణలో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సమాజ సేవలో పాల్గొనేలా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉంది. సమాజానికి ఉపయోగపడుతూ చదువుకోవాలని నా ఆశ.

-కేతక్క, ఎన్‌సీసీ కేడెట్, మొగుళ్లపల్లి

శిక్షణ పొందుతున్నా..



ఎన్‌సీసీలో చేరి మంచి శిక్షణ పొందుతున్నా. శిక్షణతో పాట బాగా చదువుకొని ఐపీఎస్ సాధించా అని లక్ష్యంగా పెట్టుకున్నాను. దేశం కోసం కష్టపడేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటున్నాయి. సమాజంలో ఎలా మెలగాలో, సమాజానికి మనం ఎలా ఉండాలో వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

- దినకరణ్ ఎన్‌సీసీ కేడెట్, మొట్లపల్లి

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



పలిమెల: గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. మండలంలోని లెంకలగడ్డ, పెద్దంపేట గ్రామాల శివారులలో ఎస్సై సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. పలు వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కావడంతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం పలిమెల నుంచి మహదేవపూర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపికలు శనివారం నిర్వహించగా సీఐ నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చిన్నరాజయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఆజయ్, సభ్యులు సాంబమూర్తి, ప్రసాద్, రాజయ్య, ఐశ్వర్య పాల్గొన్నారు.

27న సదరం క్యాంపు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 27వ తేదీన సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రకటనలో తెలిపారు. శారీరక, వినికిడి మానసిక, కంటిచూపు సమస్యలు ఉన్న వారికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల బాధితులు రెండు రోజుల ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని రావాలని సూచించారు. గతంలో రిజెక్ట్ అయిన వారికి అర్హత లేదని తెలిపారు.

కేసు నమోదు చేయాలి

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన ఎస్సీ కులస్తులైన బర్లకాపర్లు వావిళ్ల వెంకటయ్య, మేడిపల్లి కేశవ్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన సురేందర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వెంకటయ్య, కేశవ్ గ్రామంలోని గేదెలను మేతకు తీసుకెళ్లి వస్తున్న క్రమంలో సురేందర్ తన చేనులో గేదెలు చొరబడ్డాయని ఆరోపిస్తూ బర్ల కాపర్లను తీవ్రంగా దూషించి కర్రతో బాదినట్లు పేర్కొన్నారు. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు బోడ రాజు, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్ట పోచయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నైన్‌పాక శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను తనిఖీ చేయగా వారి వద్ద ఏలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో ఇసుకను తరలిస్తున్న ముగ్గురు రేగొండ మండలం దామరంచపల్లికి చెందిన కిరణ్, రాయపల్లికి చెందిన లింగారావు, రేగొండకు చెందిన శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్ఐ సమ్మిరెడ్డి, సిబ్బంది సురేందర్, యాకయ్య, నవీన్, అస్లాం జానీ, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

'పదేళ్లుగా స్ట్రక్చర్ సమావేశాలు లేవు'


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రమేశ్

భూపాలపల్లి అర్బన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీబీజీకేఎస్ 10 సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా ఉన్న స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించలేదని ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేశ్ తెలిపారు. ఏరియాలోని కేటీకే 1వ గనిలో శనివారం గని ఫిట్ కార్యదర్శి సదయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్‌కు రమేశ్ హాజరై మాట్లాడుతూ.. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన అనంతరం కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న స్ట్రక్చర్ సమావేశం చాలా కాలం అనంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గంగసరపు శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం


పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ వెంకన్న

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శనివారం ప్రారంభించినట్లు ఏడీ.డాక్టర్ వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భాదారణ చేయిస్తే మేలు జాతి ఆడదూడలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ శిబిరంలో 34 పశువులకు గర్భాదారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు అజయ్, మైథిలి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, గోపాలమిత్ర లక్ష్మణ్, పశువైద్య సిబ్బంది సుజాత, కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో విఫలమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. కాంగ్రెస్ ప్రజావంచన దినాల్లో భాగంగా శనివారం మహాముత్తారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుట్ట మధు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఏం చేయలేదని విష ప్రచారం చేస్తున్నారని మహాముత్తారం మండలం కోనంపేటలో 78 ఇళ్లు మంజూరు చేసి 73 ఇళ్లు పూర్తి చేసి ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కాలేదని అన్నారు. హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ విజయోత్సవ సభలు పెట్టడం హాస్యాస్పదకం అన్నారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను చీధరించుకొని కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ నమ్మో పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్, జక్కు రాకేశ్, మార్క రాముగౌడ్, రాధారపు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మౌనికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థిని గాజుల మౌనిక అండర్ -12 జావలీన్ త్రో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. తెలంగాణ స్టేట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మౌనిక ప్రతిభ కనబర్చింది. దీంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి చల్ల సునీత తెలిపారు. డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో మౌనిక పాల్గొననున్నట్లు ఎస్ఓ పేర్కొన్నారు. మౌనికను ఎస్ఓ సునీతతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థికసాయం

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూర్‌కు చెందిన కుమ్మరి మల్లక్క అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం పరామర్శించి బియ్యం, వంట సరుకులు పంపిణీ చేశారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన గగ్గురి నాగేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి రూ.4వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. మండల అధ్యక్షులు చిటమట రఘు, గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, వావిలాల నర్సింహారావు, వావిలాల ఎల్లయ్య, రియాజ్, గౌస్‌పాషా, సులేమాన్, సరికొప్పుల శ్రీనివాస్ ఉన్నారు.

బంద్ ప్రశాంతం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని అమరేశ్వరాలయం అనుబంధ దేవాలయంలో హనుమాన్ విగ్రహానికి మంటలు చెలరేగిన ఘటనకు నిరసనగా బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్‌ల ఆధ్వర్యంలో బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో బంద్‌ను పాటించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- తహసీల్దార్ రవికుమార్

మల్హర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మండలంలోని మల్లారం కస్తూరిబా గాంధీ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని శనివారం తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న వంట సామగ్రి, కూరగాయలు, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకమైన వంట సామగ్రిని వినియోగిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ: మండలంలోని వసతి గృహాలను తహసీల్దార్ శ్వేత, ఎంపీఓ రాంప్రసాద్, ఎంఈఓ ప్రభాకర్ శనివారం వేరువేరుగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాల, మండలంలోని లింగాల క్రాస్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే (బాలికల) పాఠశాలలోని వసతి గృహాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మహాత్మజ్యోతి బాపూలే పాఠశాలలో తహసీల్దార్ శ్వేత వంటలను పరిశీలించి వంటకాలలో నాణ్యతను పాటించాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను ఎంపీఓ రాంప్రసాద్ తనిఖీ చేసి సోలార్ వాటర్ పని చేయలేదని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కేజీబీవీని ఎంఈఓ ప్రభాకర్ తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ మనోరమ, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ మాధవి, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఆర్ఐ నరేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమేశ్ పాల్గొన్నారు.


మల్హర్: వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్


కాళేశ్వరం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

విద్యార్థులతో భోజనం చేసిన ఎంపీడీఓ

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మహదేవపూర్ ఎంపీడీఓ కె.వెంకటేశ్వర్లు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. శనివారం ఆయన హాస్టల్‌ను సందర్శించి, హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేసినారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాటారం: ప్రజలకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కోర్లల్ల శ్యాం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమిని సమకూర్చాలని కోరుతూ శనివారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఐదు డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని అన్నారు. కేజీ టూ పీజీ నాణ్యమైన ఉచిత విద్య, ప్రతి గ్రామంలో ఆధునిక ఆస్పత్రి కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా అర్హతను బట్టి గౌరవ ప్రదమైన పని కల్పించాలన్నారు. అర్హులైన రైతులందరికీ సాగు నీటి సౌకర్యంతో ఎకరం భూమి, 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు పంగ మహేశ్, సాయికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో కార్తీక సందడి


సామూహికంగా శనిపూజ నిర్వహిస్తున్న భక్తులు

- రూ.4.10లక్షల ఆదాయం

కాళేశ్వరం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం ఉదయం నుంచి త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు గోదావరిమాతకు దీపాలు వదిలారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. బ్రాహ్మణోత్తములకు దీపదానాలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలు, లక్షవత్తులు వెలిగించారు. లక్షముగ్గులు వేశారు. శనివారం కావడంతో నవగ్రహాల వద్ద శనిపూజలకు భక్తులు బారులుదీరారు. నవగ్రహాల వద్ద పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. మహిళలు సాయంత్రం సామూహికంగా దీపాలంకరణ చేశారు. దీపాలంకరణలో పాల్గొన్న మహిళలకు గాజులు, అక్షింతలు అందజేశారు. ఆలయానికి వివిధ పూజలు, లడ్డూ ప్రసాదముల ద్వారా ఒక్కరోజులో రూ. 4.10లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

బాధిత కుటుంబానికి పరామర్శ



టేకుమట్ల: మండలంలోని మందలోరిపల్లె గ్రామానికి చెందిన మండల రాజిరెడ్డి తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, రేగొండ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిబ్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రామచంద్రరావు, నాయకులు పెండ్యాల రాజు, శివకృష్ణ, రాకేశ్ ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు


చిట్యాల: సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు


కాటారంలో..


టేకుమట్లలో..

చిట్యాల: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంతో శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ సురేశ్, మైదం శ్రీకాంత్, వల్లాల ప్రవీణ్, రాయిని శ్రీనివాస్, గుండ మణికుమార్, సదానందం, రాజేందర్ నాగరాజు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, పాగె రంజిత్, జిల్లెల శ్రీశైలం , గంట అంకయ్య, మంత్రి సునీల్, ఆశయ్య, రవీందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచంద్రరావు మాట్లాడుతూ.. మహారాష్ట్ర ప్రజలు ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పారని అన్నారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో సైతం బీజేపీ అధికారంలోకి వస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గుర్రపు నాగరాజు, శ్రీపతి రవి, కూర సురేందర్‌రెడ్డి, అమిరిశెట్టి రమేశ్, శివ, దుస్స శివ, రాజయ్య, రఘోత్తంరెడ్డి, బొడ్డు రాజేందర్, కుమార్, శ్యాం, కరట్లపెల్లి సాయి, సంగి సంపత్, మంద వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.